నేడు నార్సింగిలో కాంగ్రెస్ సమావేశం

మణికొండ: నార్సింగిలోని కేవీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 12న (నేడు) ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మణికొండ మున్సిపాలిటీ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ముఖ్య అతిథిగా వికారాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ పి.సునీతామహేందర్ రెడ్డి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలను సమాయత్తం చేసేలా దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఔటర్‌పై కారును ఢీకొట్టిన బొలెరో

మణికొండ: ఔటర్‌రింగ్ రోడ్డుపై వెళ్తున్న ఓ కారును బొలెరో వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ బస్ డిపో ప్రాంతానికి చెందిన మహ్మద్ యూసుఫ్ తన క్యాబ్‌లో ప్రయాణికులను తీసుకొని గచ్చిబౌలి నుంచి శంషాబాద్‌కు వెళ్తున్నాడు. నార్సింగి వద్దకు చేరుకోగానే వెనుకాల నుంచి వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొట్టింది. దీంతో కారు డ్రైవర్ మహ్మద్ యూసుఫ్‌తో పాటు ప్రయాణికుడు అనిల్ గాయపడ్డారు. వెంటనే వారిని 108 అంబులెన్స్‌లో సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. క్యాబ్ డ్రైవర్ కుమారుడు మహ్మద్ ఆసిఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



టార్గెట్ దిశగా..

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తి పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

- లక్ష్యం రూ.28.39 కోట్లు
- ఇప్పటివరకు రూ. 17.80 కోట్ల వసూళ్లు
- మిగిలిన గడువు 19 రోజులు
- ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పిస్తున్న అధికారులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆస్తిపన్ను వసూళ్లకు అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. మరో 19 రోజుల్లో వార్షిక సంవత్సరం ముగియనుండడంతో టార్గెట్ చేరుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. శరవేగంగా కార్పొరేషన్ అభివృద్ధి చెందుతుండడంతో పన్నుల రూపంలో భారీగా ఆదాయం సమకూరుతుంది. అలాగే సుదీర్ఘకాలం పాటు ఇంటిపన్ను చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులుహెచ్చరిస్తున్నారు.

గత ఆర్థిక సంవత్సరం..

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అప్పుడు 30,840కు పైగా నివాసాలకు అసెస్‌మెంట్ చేసి ఉండగా, కొంతమంది సకాలంలో పన్ను చెల్లించకపోవడంతో అపరాధ రుసుం కలిపి మొత్తం ఆదాయం రూ. 13.86 కోట్లు వచ్చింది.

ఈ ఆర్థిక సంవత్సరం రూ. 28.39 కోట్ల టార్గెట్..

2023–24కి సంబంధించి 33,280 నివాసాలకు అసెస్‌మెంట్ చేయగా పాత బకాయిలతో కలిపి రూ. 28.39 కోట్ల టార్గెట్ నిర్దేశించగా, మార్చి 11 వరకు రూ. 17.80 కోట్లు వసూలయ్యాయి. మిగితా రావాల్సిన రూ.10.59 కోట్లను ఈనెల నెలాఖరు వరకు వసూలు చేసే పనిలో బిల్ కలెక్టర్లు, సిబ్బంది నిమగ్నమయ్యారు.

స్పెషల్ డ్రైవ్..

కేవలం 19 రోజుల గడువు ఉండడంతో వందశాతం వసూలు చేయాలనే లక్ష్యంతో కార్పొరేషన్ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ప్రత్యేకంగా రెండేళ్ల నుంచి పన్నులు కట్టని వారిపై ప్రత్యేక దృష్టి సారించారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా ప్రభుత్వం రూపొందించిన వెబ్‌సైట్, లేదా మీ సేవ కేంద్రాల ద్వారా పన్ను చెల్లించాలని ప్రజలను బిల్ కలెక్టర్లు, కార్పొరేషన్ సిబ్బంది కోరుతున్నారు.

గతంలో లక్షల్లోనే ఆదాయం..

గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో కేవలం రూ.లక్షల్లోనే ఆదాయం వచ్చేది. పన్నులు కట్టేందుకు ఆసక్తి చూపని ప్రజలు కార్పొరేషన్ ఏర్పడిన అనంతరం నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లకు అసెస్‌మెంట్ పూర్తి చేయడంతో పాటు ఇంటి నంబర్లు కేటాయించి పన్నులు విధించడంతో కార్పొరేషన్‌కు భారీగా ఆదాయం పెరుగుతోంది. అధికారులు, సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తుండడంతో ప్రజలు సైతం పన్నులు కట్టేందుకు ముందుకొస్తున్నారు.

కార్పొరేషన్ పరిధిలో సుమారు 1.50 లక్షల జనాభా

కార్పొరేషన్ పరిధిలో 200 కాలనీలు ఉండగా సుమారు 1.50 లక్షల జనాభా ఉన్నట్లు అంచనా. మున్సిపల్ కార్పొరేషన్ పరిధి కిస్మత్‌పూర్, దర్గా ఖలీజ్ ఖాన్, హిమాయత్ సాగర్, హైదర్‌షాకోట్, బండ్లగూడజాగీర్, పీరం చెరువు, గంధంగూడ, బైరాగిగూడ తదితర ప్రాంతాలు కలిసి కార్పొరేషన్‌గా ఏర్పడింది. ప్రస్తుతం 33,280 నివాస గృహాలు ఉండగా 200 కాలనీలు ఏర్పడ్డాయి.

పన్నుపై 5% రాయితీ..

మున్సిపల్ కార్పొరేషన్ పన్నుపై రాయితీ కల్పించారు. ఏప్రిల్‌లో మొత్తం సంవత్సరం పన్ను చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తుంది. ప్రతి సంవత్సరంలో చెల్లించాల్సిన పన్నులు సకాలంలో చెల్లించకపోతే పెనాల్టీ విధిస్తున్నారు. రాయితీలను సద్వినియోగం చేసుకునేవారు తక్కువగా ఉంటుండగా చాలామంది మార్చిలోనే పన్నులు చెల్లించేందుకు మొగ్గు చూపుతున్నారు.

పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించండి



ప్రజలు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలి. కార్పొరేషన్‌కు ఆదాయం పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టినం. పన్నులు స్వీకరించి రసీదులు అందజేస్తున్నాం. ప్రజలు చెల్లిస్తున్న ప్రతి రూపాయిని కార్పొరేషన్ అభివృద్ధి కోసమే ఖర్చు చేస్తాం.

–బి. శరత్‌చంద్ర,
బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

నేడు ధర్మ జాగరణ కార్యక్రమం

అత్తాపూర్: ఈ నెల 12 న (నేడు) ఉదయం 9 గంటలకు దేవాలయం పరిరక్షణ, హిందూ సమాజం జాగృతి, ధర్మ జాగరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు శ్రీ దుర్గమాతా ఆలయ సేవా సమితి కమిటీ ప్రతినిధులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి కమలానంద భారతీ స్వామి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ధర్మ రక్షణ, సమాజాన్ని జాగృతం చేయడం మన కర్తవ్యంగా భావించి రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

భారీ మెజార్టీకి కృషి చేయాలి

ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆనంద్‌గౌడ్

మణికొండ: పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేలా ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, కోకాపేట కమ్యూనిటీ హాల్‌లో సోమవారం సాయంత్రం జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సామాజిక సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.దేశంలో అవినీతిరహిత ప్రభుత్వానికి ప్రజలు మద్దతు ఇచ్చేందుకు మరోసారి సిద్ధంగా ఉన్నారని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించి బీజేపీకే ఓటు వేసేలా ప్రజలను కోరాలన్నారు.

రూపురేఖలు మారుద్దాం..

కేంద్రంలో మూడోసారి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడుతుందని, చేవెళ్లలో తనను గెలిపిస్తే కేంద్రం నుంచి అనేక రకాల నిధులు తీసుకువచ్చి నియోజకవర్గ రూపురేఖలను మారుస్తానని బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే రీజినల్ రింగ్ రోడ్డు, హైదరాబాద్– బీజాపూర్ జాతీయ రహదారి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేసిందన్నారు. అలాంటి పెద్ద ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం నుంచే నిధులను రాబట్టాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వరప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంజన్‌కుమార్‌గౌడ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు భిక్షపతియాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

శంషాబాద్: ఖాతాదారులకు మెరుగైన సేవలందించడమే తమ లక్ష్యమని బ్యాంక్ ఆఫ్ ఇండియా దక్షిణ విభాగం–2 జనరల్ మేనేజర్ వివేకానంద దూబే అన్నారు. 12 ఏళ్లగా పట్టణంలోని గౌతమి కళాశాల వద్ద ఉన్న బ్యాంక్ కార్యాలయాన్ని చైతన్య కళాశాల ఎదుట ఉన్న భవనంలోకి మార్చగా సోమవారం ఆయన నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బ్యాంకింగ్ రంగంలో ఉన్న పోటీని తట్టుకుని అన్ని వర్గాల ప్రజలకు ఉత్తమ సేవలందించేందుకు తమ బ్యాంక్ కృషి చేస్తున్నాదన్నారు. అనేక రకాల రుణాలను తక్కువ వడ్డీకే అందిస్తున్నామని పేర్కొన్నారు. శంషాబాద్ బ్రాంచిలో 15 వేలకు పైగా ఖాతాదారులు ఉండడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో తెలంగాణ జోనల్ మేనేజర్ శుభాకర్, డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్రీవాత్సవ్, ప్రధాన కార్యదర్శి నాగేశ్వర్, శంషాబాద్ బ్రాంచ్ మేనేజర్ తలారి లావణ్య ఖాతాదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నార్మ్‌లో ప్రత్యేక కోర్సులు ప్రారంభం

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్ (నార్మ్)లో నాబార్డ్ సహాయంతో ప్రత్యేక కోర్సులను సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి మహారాష్ట్ర నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ రష్మీ దారద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కోర్సులతో విశ్లేషణాత్మక సమస్య పరిష్కారం వ్యవస్థాపక నైపుణ్యాలు, మార్కెటింగ్ వ్యూహాత్మక నిర్వహన వంటివి నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఎదుర్కొంటున్న సవాళ్లు, స్థిరమైన వృద్ధికి ఈ అడ్డంకులను అధిగమించడంలో నాయకత్వం యొక్క కీలక పాత్రను ఆమె నొక్కిచెప్పారు. కార్యక్రమంలో ఐసీఏఆర్–నార్మ్ డైరెక్టర్ జనరల్ శ్రీనివాస్‌రావు,సైంటిస్ట్ సెంథిల్ ఇంతకుముందు శిక్షణ పొందిన రైతులు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఎఫ్‌పీఓలు, నాబార్డ్, నార్మ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నార్మ్ అధికారులు

ఎంజీఐటీలో ఎనర్జీ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న పాట్రిక్ ఫెలన్

మణికొండ: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో సీజీసీ–ఎంజీఐటీ, జీఈసీఎఫ్ ఆధ్వర్యంలో 'ది వాల్యు ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ 'అనే అంశంపై సోమవారం సదస్సు నిర్వహించారు. ఇందులో అమెరికాలోని అరిజోనా స్టేట్ యూనివర్సిటీ మెకానికల్, ఏరోస్పేస్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ పాట్రిక్ ఫెలన్ ముఖ్య అతిథిగా హాజరై ఇంధన సామర్థ్యం పెంపొందించే అంశాలు, ఇంధన పునరుత్పాదక వనరులపై పరిశోధనా అంశాలను విద్యార్థులకు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతిజ్ఞ చేసిన 2070 నాటికి కార్బన్ న్యూట్రాలిటీని సాధించడం అనే అంశంపై ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్ రెడ్డి మాట్లాడారు. సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ కె. సుధాకర్ రెడ్డి, సీజీసీ చైర్మన్ డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి సరఫరాను పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: కాలనీలకు ప్రస్తుతం గంటపాటు నీటి సరఫరా అవుతున్నదని దానిని మరో మరో 20 నిమిషాల పాటు పెంచాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్ సూచించారు. గమున్సిపల్ కార్యాలయంలో జలమండలి అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లోని వార్డు కౌన్సిలర్, లైన్‌మెన్లతో కలిసి నీటి సమస్యపై ప్రజల అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఎత్తులో ఉన్న కాలనీలకు బూస్టర్లు పెట్టి సరఫరా వేగాన్ని పెంచాలన్నారు. వేసవి రాకముందే అపార్ట్‌మెంట్లలో బోర్లు వట్టిపోవడంతో నీరు సరిపోక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి సకాలంలో ట్యాంకర్లను అందించే ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాబోయే రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మసీదుల వద్ద వీధి దీపాల ఏర్పాటు, నీటి సౌకర్యాన్ని కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

- అనంతరం జలమండలి జీఎం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ నీటి సరఫరాను పెంచేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే గంట ఇరవై నిముషాలు సరఫరా చేసి సమస్యను పూర్తిగా నివారిస్తామని పేర్కొన్నారు. 15 రోజుల క్రితం పైప్‌లైన్ పగిలిపోవడం , నాలుగు రోజులు నీటి సరఫరా జరగకపోవడంతో సమస్య వచ్చిందని, అది ఇపుడు తీరిందని, రోజు విడిచి రోజు అన్ని కాలనీలకు నీటిని సరఫరా చే స్తున్నామన్నారు. అలాగే ఎత్తులో ఉన్న కాలనీలకు బూస్టర్లను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కమిషనర్ డి. ప్రదీప్‌కుమార్, జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి, మున్సిపల్ డీఈ దివ్య జ్యోతి, ఏఈ సాయిమౌనిక, కౌన్సిలర్ డి.పురుషోత్తం, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, నాయకులు యాలాల నరేశ్, బి.ముత్యాలు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



రథోత్సవంలో పాల్గొన్న మంచిరేవుల గ్రామస్తులు

మణికొండ: మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 8వ తేదీన ప్రారంభమైన మంచిరేవుల శ్రీ మచిలేశ్వరస్వామి, శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు ఉదయం నందీశ్వరసేవ, రథోత్సవాన్ని నిర్వహించారు. స్వామి వార్లను రథంపై ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. నాలుగు రోజుల పాటు జరిగిన బ్రహ్మోత్సవాలకు భక్తులతో పాటు మంచిరేవులతో పాటు గండిపేట మండలవ్యాప్తంగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేశారని ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు తెలిపారు.

లోప్రెజర్ సమస్యను పరిష్కరించాలి



సమస్యను పరిశీలిస్తున్న జలమండలి అధికారులు, అసోసియేషన్ ప్రతినిధులు

రాజేంద్రనగర్: ఎర్రబోడ ప్రాంతంలోని తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎర్రబోడ వీకర్ సెక్షన్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం జలమండలి అధికారిని కలిశారు. లోప్రెజర్ తో రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా అవుతుండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీంతో ఆయన స్పందించి వెంటనే సిబ్బందిని ఎర్రబోడ ప్రాంతానికి పంపించి సమస్యను పర్యవేక్షించారు.

ఘనంగా మహిళా దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు, విద్యార్థినులు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నృత్య నాటికలు, పాటలు పాడడం, ఏకపాత్రాభినయాలు, పలు రకాల డ్యాన్సులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ మహిళలు పాలనా దక్షిత కలిగి ఉండాలని సంస్థ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అలాగే ఈ సంవత్సరంలో ఉద్యోగ విరమణ చేయనున్న మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలో ..

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రంలోని మర్రి చెట్టు కూడలి పక్కన ఉన్న ఓ మినీఫంక్షన్‌హాల్‌లో బీఆర్ ఎస్ మున్సిపల్ మహిళా అధ్యక్షురాలు పి.రూపారెడ్డి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు పలు రకాల ఆటలు, పాటల పోటీలను నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మహిళా నాయకురాళ్లతో పాటు కృషి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న రూపారెడ్డి, మహిళలు

ఉద్యాన విశ్వవిద్యాలయంలో..

ఏజీవర్సిటీ: కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వీసీ నీరజాప్రభాకర్ మాట్లాడుతూ ఈ సృష్టికి మూలం, మగువేనని, మహిళ తన జీవితంలోఎన్నో రకాల ఒడిదుడుగులను ఎదుర్కొంటూ కష్ట నష్టాలను భరిస్తూ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.హైకోర్టు న్యాయవాది దండా ధాధిక మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థినులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాటలు పాడుతూ నృత్యాలు చేస్తున్న మహిళా ఉద్యోగులు



గ్రూప్ సాంగ్ పాడుతున్న మహిళలు



రుద్రమదేవి వేషధారణలో..

అదనంగా డబ్బుల సేకరణ తగదు



మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

శంషాబాద్: ఇంటి పన్ను, లైసెన్స్ ఫీజు వసూలు చేస్తున్నా.. మున్సిపాలిటీ సిబ్బంది చెత్త సేకరణకు అదనంగా డబ్బులు సేకరించడం తగదని బీజేపీ నేతలు అన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్, పట్టణాధ్యక్షుడు దేవేందర్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి తదితరులు సోమవారం శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావును కలిసి పలు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్బుల సేకరణకు సంబంధించి ఏమైనా జీవో ఉంటే దానిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఆస్తి పన్నును అడ్డగోలుగా పెంచారని దానిని సవరించాలని కోరారు. జలమండలి సరఫరా చేస్తున్న తాగునీటిలో బోరు నీరు కలిసి వస్తున్నదని, దీనిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో వంశీయాదవ్, జగ్జీవన్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, అశోక్, వీరేశ్, మెట్టు రమేశ్, కరుణాకర్‌రెడ్డి, రాకేశ్ ,నాని తదితరులు ఉన్నారు.

అంతర కళాశాలల పోటీలు షురూ



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ వెంకటరమణ



ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అంతర కళాశాలల సాంస్కృతిక, సాహిత్య పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభ, సృజనాత్మకతను కనబర్చేందుకు ఇది మంచి వేదిక అని అన్నారు. పోటీల్లో పాల్గొనడం వలన సహకారం, సమన్వయం, నెట్ వర్కింగ్ వంటివి అలవాటు చేసుకుంటారని అన్నారు. పోటీల్లో ప్రతిభ చూపిన వారు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు నరేందర్‌రెడ్డి, డాక్టర్ సీమ, సత్యనారాయణ, బి విజయలక్ష్మి, వర్సిటీ అబ్జర్వర్ డాక్టర్ త్రివేణి పాల్గొన్నారు.

అయోధ్య ప్రసాదం పంపిణీ



ప్రసాదం పంపిణీ చేస్తున్న బీజేపీ నేతలు

శంషాబాద్: పట్టణంలోని ఆర్‌బీనగర్‌లో బీజేపీ నేతలు అయోధ్య బాల రాముడి ప్రసాదాన్ని సోమవారం పంపిణీ చేశారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వీటిని అందజేసినట్లు కిసాన్‌మోర్చా మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి తెలిపారు. అయోధ్య బాలరాముడిని దర్శించుకోలేని వారి ఇంటికే ప్రసాదాన్ని చేరవేస్తున్నట్లు పేర్కొన్నారు. బాబుల్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, ముకుంద్‌రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

రాజేంద్రనగర్: బస్తీల్లోని సమస్యలను పరిష్కరించాలని శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయి మల్లిక్ కోరారు. ఈ మేరకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌ను సోమవారం ఆయన కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుద్వేల్ గ్రామం, బన్సీలాల్‌నగర్, చాకలిబస్తీ, సాయినగర్ కాలనీ రోడ్డు తదితర ప్రాంతాల్లో సమస్యలు ఉన్నాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే కూడా సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారని ఆయన తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి

రాజేంద్రనగర్: ఆటోలో గంజాయి తరలిస్తున్న ఒకరిని ఎస్ఓటీ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎం పహడీ ప్రాంతానికి చెందిన మహ్మద్ షకీల్ తన ఆటోలో గంజాయిని తీసుకెళ్తుండగా రాజేంద్రనగర్ అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పిల్లర్ నంబర్ 172 డి–మార్ట్ సర్వీసు రోడ్డు వద్ద ఎస్ఓటీ పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి నుంచి 210 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్, ఆటోను స్వాధీనం చేసుకొని సీజ్ చేసి అత్తాపూర్ పోలీసులకు అప్పగించారు. గంజాయిని ఎక్కడి నుంచి సరఫరా చేస్తున్నాడు..? ఎవరి దగ్గర నుంచి తీసుకువస్తున్నాడు..? అనే కోణంలో ఎస్ఓటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.